కాంగ్రెసోళ్లకు కండ్లుంటే.. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టును చూడాలి

తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరని వ్యాఖ్య

కాళేశ్వరం వద్ద గోదావరి నదికి మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్, జూలై 26 : రైతు సంక్షేమమే ధ్యేయంగా మాజీ సీఎం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే తెలంగాణ రాష్ట్రం దేశానికే అన్నం పెడుతుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా ఆయన మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి గోదావరి నదికి పూజలు నిర్వహించి.. అనంతరం మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులకు కండ్లుంటే ఓసారి కాళేశ్వరం ప్రాజెక్టును చూడాలని హితవు పలికారు. కేవలం తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ కూలిపోతుందని ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులు ప్రస్తుత వరదను చూసి ప్రజలకు ఏం చెబుతారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఉన్న అన్ని పంప్‌హౌస్‌లు విజయవంతగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాయని.. కేవలం తమ రాజకీయాల కోసం రైతులను ఆగం చేసేందుకు, బీఆర్ఎస్ పార్టీని బద్నాం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కార్ కు టిల బుద్ధిని ప్రజలు గ్రహించారని రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

తహసీల్దార్ భవనాన్ని

త్వరగా పూర్తి చేయాలి

కడ్తాల్, జూలై 26 : తహసీల్దార్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలో కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయించాలని తహసీల్దార్ ముంతాజ్‌కు సూచించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి సమస్యలను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బండ్లగూడజాగీర్ కార్పొరేషన్‌లోకి

రెండు గ్రామాలు !

- హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్ గ్రామాల విలీనానికి వివరాలను సేకరించిన అధికారులు
- కలెక్టర్ శశాంకకు నివేదిక అందజేత

హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ

అజీజ్‌నగర్ గ్రామ పంచాయతీ

మొయినాబాద్, జూలై 26 : మండలంలోని హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్ గ్రామాలను బండ్లగూడజాగీర్ కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేయడంతోపాటు కలెక్టర్‌కు నివేదకను అందజేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆనుకుని హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్ గ్రామాలున్నాయి. ఈ రెండు గ్రామాలను గ్రేటర్‌లో కలిపితే పన్నుల భారం పెరుగడంతోపాటు అభివృద్ధి కూడా జరుగుతుందని స్థానికులు భావిస్తున్నారు. 2011 జనాభా ప్రకారం అజీజ్‌నగర్ గ్రామంతోపాటు అనుబంధ గ్రామమైన బంగాలిగూడను కలుపుకొని 4,757 జనాభా ఉన్నది. అదేవిధంగా అజీజ్‌నగర్ గ్రామ జనాభా 4,703 మంది ఉండగా, అనుబంధ గ్రామ జనాభా 54 మంది ఉంటారు. హిమాయత్‌నగర్ గ్రామ జనాభా 2011 ప్రకారం 3,902 మంది ఉన్నారు. అదేవిధంగా అజీజ్‌నగర్‌లో 2,386 ఎకరాల భూమి ఉండగా.. ప్రస్తుతం ఎకరానికి మార్కెట్ విలువ రూ.52,50,000గా ..అదేవిధంగా హిమాయత్‌నగర్‌లో 1295.12 ఎకరాల భూమి ఉండగా ప్రస్తుతం ఎకరానికి మార్కెట్ విలువ రూ.52,50,000గా ఉన్నది.

రెండు గ్రామాల్లో పెరిగిన జనాభా..

అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ గ్రామాలు నగరం, ఔటర్ రింగ్‌రోడ్డును ఆనుకుని ఉండడంతోపాటు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారికి సమీపంలో ఉంటాయి. ఈ రెండు మేజర్ గ్రామ పంచాయతీలు హిమాయత్‌సాగర్, గండిపేట జలాశయాల పరిధిలో ఉండడంతో జలాశయాల వీవ్ కనిపించేలా కొంతమంది వీఐపీలు(ఐఏఎస్, ఐపీఎస్, రాజకీయ, సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు) భూములు కొనుగోలు చేసి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆ రెండు గ్రామాల్లో 2011 జనాభా కంటే రెండింతలు ఎక్కువగా జనాభా పెరిగింది. జనసాంద్రత ఎక్కువ కావడంతో ఆ రెండు గ్రామాలూ కొంత పట్టణ వాతావరణాన్ని కలిగి ఉంటాయి. ప్రస్తుతం అజీజ్‌నగర్ గ్రామంలో 1,374 గృహాలుండగా, ఓటర్లు 4918 మంది ప్రస్తుత జనాభా సుమారుగా 9000 పైగానే ఉన్నది. హిమాయత్‌నగర్ గ్రామంలో 927 గృహాలుండగా ఓటర్లు 4,878 మంది, ప్రస్తుత జనాభా 6,341 మంది ఉన్నారు.

సీఎంఆర్‌ను పూర్తి చేయాలి

సీఎంఆర్‌ను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని వెంకట రమణ రైస్‌మిల్లును పరిశీలించి.. ఆగస్టు 15లోపు నిర్దేశించిన సీఎంఆర్‌ను పూర్తి చేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి, పౌరసరఫరాల మేనేజర్ డీఎంలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. -వికారాబాద్, జూలై 26

ట్రైబల్ డిక్లరేషన్ అమలు చేయాలి

ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్ల వేదికగా కాంగ్రెస్ ప్రకటించిన ట్రైబల్ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సాయిలాల్ నాయక్, కోశాధికారి శ్రీనివాస్‌నాయక్, రాష్ట్ర నాయకులు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, భాగ్యలక్ష్మి, లక్ష్మణ్ నాయక్, వినోద్ కుమార్ నాయక్, గణేశ్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.
-రంగారెడ్డి, జూలై 26 (నమస్తే తెలంగాణ)

ఫార్మా కంపెనీకి భూములివ్వం



తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

- సాగు భూముల్లో సర్వేను నిలిపేయండి
- తాండూరు ఆర్డీవోకు రైతుల విజ్ఞప్తి

బొంరాస్‌పేట, జూలై 26 : తరతరాలుగా భూములను సాగు చేసుకుని జీవిస్తున్నామని.. పర్యావరణానికి, రైతులకు హాని చేసే ఫార్మా కంపెనీకి తమ భూములను ఇవ్వమని, సాగు భూముల్లో వెంటనే సర్వేను నిలిపేయాలని దుద్యాల మండలంలోని హకీంపేట, పోలేపల్లి గ్రామా ల రైతులు శుక్రవారం తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం దుద్యాల మండలంలోని పోలేపల్లి, లగచెర్ల, హకీంపే ట, పులిచెర్లకుంటతండాలకు చెందిన రైతు లు సాగు చేసుకుంటున్న భూముల్లో అధికారులు సర్వే చేసేందుకు కొన్ని రోజులుగా ప్రయత్నిస్తున్నారని, రైతులకు సమాచారం ఇవ్వకుండా ఎటువంటి సర్వేలు చేయొద్దని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామాల్లో సభలు నిర్వహించి రైతులకు సమాచారం ఇచ్చి వారి అభిప్రాయం మేరకే అధికారులు నిర్ణయం తీసుకోవాలన్నారు. అంతకుముం దు కొడంగల్‌లో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డికి కూడా రైతులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పోలేపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీమన్నారాయణ, ర్యాకం యాదయ్య, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రుద్రారాన్ని సందర్శించిన కడా ప్రత్యేకాధికారి

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల నేపథ్యంలో.. గ్రామంలోని సమస్యల పరిశీలన

మండలంలోని రుద్రారం గ్రామాన్ని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి శుక్రవారం సందర్శించి పరిశీలించారు. వారం రోజుల కిందట స్థానికులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఆయన కడా ప్రత్యేకాధికారి గ్రామానికొచ్చి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని సూచించారు. సీఎం ఆదేశాల మేరకు వెంకట్‌రెడ్డి గ్రామానికి వచ్చి పలు సమస్యలను క్షుణ్ణంగా పరిశీలిం చారు. అంతేకాకుండా గ్రామానికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన లబ్ధి దారులకు మంజూరు చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు వెంకటయ్య, ముస్తాక్, ఆనంద్‌రెడ్డి, సంతోష్, మాజీ సర్పంచ్ సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు. -కొడంగల్, జూలై 26

పెంజర్ల గ్రామ పంచాయతీ తనిఖీ

కొత్తూరు, జూలై 26 : మండలంలోని పెంజర్ల గ్రామ పంచాయతీని జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పింఛన్ల పంపిణీతోపాటు గ్రామంలో జరుగుతున్న పల్లెప్రగతి, పరిశుభ్రత పనులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో విజయలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ సురేందర్‌తదితరులున్నారు.

సల్లంగ చూడు తల్లీ..

- గ్రామాల్లో ఘనంగా ఆషాఢ మాస బోనాలు
- అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

పెద్దేముల్ : కందనెల్లిలో ఊరడమ్మ ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట : మండలంలోని బురాన్‌పూర్, బొంరాస్‌పేట, తుంకిమెట్ల , రేగడిమైలారం గ్రామాల్లో పోచమ్మతల్లి, ఈదమ్మ, దుర్గామాత బోనాల పండుగను శుక్ర వారం ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా అమ్మవార్ల ఆలయాలకెళ్లి ప్రదక్షిణలు చేసి.. అమ్మవారికి బోనాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ప్రార్థించారు.

పెద్దేముల్, జూలై 26 : అందరినీ సల్లంగ చూడు తల్లీ అంటూ మండలంలోని కందనెల్లి గ్రామస్తులు శుక్రవారం గ్రామదేవత ఊరడమ్మకు ఆషాఢ మాసబోనాలను సమర్పించారు. ఉదయం నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. స్థానికులు ఉదయం నుంచే ఆలయానికెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం మహిళలు, యువతులు తలలపై బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికెళ్లి బోనాలు, నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అందరూ బాగుండాలని కోరుకున్నారు.

బొంరాస్‌పేట : తుంకిమెట్లలో

స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ధర్నా

స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేవెళ్లటౌన్, జూలై 26 : మండల కేంద్రంలోని సిల్వర్ డే స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిల్వర్ డే స్కూల్ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆ పాఠశాలకు ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపు లేకున్నా.. గుర్తింపు ఉందని చెబుతూ తల్లిదండ్రులను మోసం చేస్తూ వేల రూపాయలను వసూలు చేస్తున్నదని ఆరోపించారు. ఆ స్కూల్‌లో సరిపడా వసతుల్లేవని.. అర్హత లేని ఉపాధ్యాయులతోనే పిల్లలకు పాఠాలను బోధిస్తున్నారన్నారు. పాఠశాల యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు, చరణ్‌తేజ, మణి, గురుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ (ఎంఏఎం) రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 26 : ఓయూ పరిధిలోని ఎంబీఏ(ఎంఏఎం) పరీక్షా రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సు సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఎంఫార్మసీ వన్‌టైం చాన్స్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూలో ఎంఫార్మసీ పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలి, కాలపరిమితి పూర్తైన వారికి వన్‌టైం చాన్స్ అవకాశం కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2000 తర్వాత ఎంఫార్మసీలో చేరిన వారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్షా ఫీజును వచ్చే నెల 22 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలకు సాధారణ పరీక్షా ఫీజుతోపాటు జరిమానా కూడా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్లు, పరీక్షా తేదీల పూర్తి వివరాలు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పాతబస్తీ లాల్ దర్వాజా బోనాల వేడుకలు

రేపు, ఎల్లుండి ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, జూలై 26 (నమస్తే తెలంగాణ): సింహవాహిని శ్రీ మహంకాళి లాల్ దర్వాజా బోనాల పండుగ సందర్భంగా పాత నగరంలోని ఫలక్‌నుమా, చార్మినార్, మీర్‌చౌక్, బహదూర్‌పురా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో ఈ నెల 28, 29 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. పాతబస్తీలో ఆదివారం బోనాలు, సోమవారం ఘటాల ఊరేగింపు ఉంటుందన్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు అదనపు సీపీ వెల్లడించారు. అక్కన్న మాదన్న ఆలయం నుంచి నయాపూల్ వరకు కొనసాగే భారీ ర్యాలీలో ఏనుగుపై ఊరేగింపు ఉంటుందన్నారు. వేడుకలకు వచ్చే వారు కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలను పార్కు చేయాలని సూచించారు.

వంద ప్రత్యేక బస్సులు..

సింహ వాహిని శ్రీ మహంకాళి లాల్‌దర్వాజ బోనాలను పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వంద ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాల్ దర్వాజ ఆలయం, ఎంజీబీఎస్, రేతిఫైల్, జేబీఎస్‌ల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమాచారం కోసం 9959226154, 9959226160 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను స్థానిక నాయకులతో కలిసి పరిశీలిస్తున్న మాజీ జడ్పీటీసీ అనురాధ

ఆమనగల్లు, జూలై 26 : పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు పనులను త్వరగా పూర్తి చేయాలని మాజీ జడ్పీటీసీ సభ్యురాలు నేనావత్ అనురాధ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆ భవనాలను పరిశీలించి మాట్లాడారు. ఆమనగల్లు మండలాభివృద్ధికి మాజీ కేసీఆర్ సహకారంతో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రూ. 4.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు, రూ.3.27 కోట్లతో కత్వవాగుపై వంతెన నిర్మాణ పనులు చేపట్టారన్నారు. దాదాపు 70శాతం పనులు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తైనా కాంగ్రెస్ ప్రభు త్వం కావాలనే వాటిని పెండింగ్‌లో ఉంచిందన్నారు. అదేవిధంగా రూ. 2.5 కోట్లతో చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులూ దాదాపు 80శాతం పూర్తయ్యాయని, కళాశాల స్థల వివాదం కోర్టులో ఉన్నందున ఈ సమస్యపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, మాజీ ఎంపీటీసీ దోనాదులకుమార్, బీఆర్ఎస్ నాయకులు బాలస్వామి, పంతు, శ్రీనూనాయక్, రమేశ్‌నాయక్, కొమ్ము ప్రసాద్, సతీశ్, వెంకటేశ్, భాస్కర్, లండం యాదయ్య, ఆనంద్, శివ, గణేశ్, దేవేందర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

చర్లపటేల్‌గూడలో మొక్క నాటి నీరు పోస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌డీవో శ్రీలత

ఇబ్రహీంపట్నం రూరల్, జూలై 26 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములై వాటిని సంరక్షించాలని రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చర్లపటేల్‌గూడ గ్రామంలో జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో ఆమె డీఆర్‌డీవో శ్రీలతతో కలిసి పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది రంగారెడ్డి జిల్లాలో 82 లక్షల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 30 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. పదిరోజుల్లో మిగిలిన టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, గ్రామకంఠం, రైతుల పొలంగట్ల వెంబడి మొక్కలు నాటాలన్నారు. ప్రతి ఇంట్లో నూ ఆరు మొక్కలు తగ్గకుండా నాటాలన్నారు. మొక్కలను మనం రక్షిసే..అవి మన ల్ని రక్షస్తాయని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ సక్రియానాయక్, ఎంపీడీవో, ఏపీవో తిరుపతిచారి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్, మైనార్టీల కోసం

శ్మశాన వాటికలు నిర్మిస్తాం

తెలంగాణ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ చౌహాన్

ఇబ్రహీంపట్నం, జూలై 26 : హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని క్రిస్టియన్, మైనార్టీల కోసం ప్రత్యేక శ్మశాన వాటికలను నిర్మిస్తామని తెలంగాణ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ చౌహాన్ అన్నారు. శుక్రవారం ఆయన ఇబ్రహీంపట్నం సమీపంలోని గోశాల రోడ్డులో క్రిస్టియన్, మైనార్టీల శ్మశాన వాటికల నిర్మాణానికి కేటాయించిన ఐదెకరాల స్థలాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో క్రిస్టియన్ శ్మశాన వాటికల కోసం 20 ఎకరాలు ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అందులో భాగంగానే ఈ స్థలాన్ని కేటాయించిందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సబిత, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ నవీన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, నాయకులు విక్టర్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐదు గిరిజనుల ఐటీడీఏలు ఎక్కడ ?

షాద్‌నగర్, జూలై26 : అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను మరిచిపోయిందని ఎల్ హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజనుల సంక్షేమం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఖమ్మం, మహబూబాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఒక్కో ఐటీడీఏకు రూ.500 కోట్ల చొప్పున కేటాయిస్తామని చెప్పి.. బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా మోసపూరిత ప్రచారాన్ని మానుకొని గిరిజనుల సంక్షేమానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు